## కథ

# కొత్త తగాదాలు

వై. రుక్మిణీదేవి

**తెరిచివున్న గుమ్మంలోంచి లోపలికి వచ్చిన శ్రీధర్ పెరట్లో తల్లి అరుపులు విని గబగబా వచ్చి వంటింటి వెనుక గుమ్మంలో నిలబడిపోయాడు.**

**"నీకు ఎబార్షన్ అయినప్పుడు చాకిరి ఎంత చేశాను ఆ చెయ్యీ ఈ చెయ్యీ కాకుండా. కాస్తంతైనా విశ్వాసం వుందా?" అరుస్తోంది సువర్ణమ్మ.**

''అలాంటి చాకిరీలు సవాలక్ష చేశా నీకు. హైబి.పి.తో హాస్పిటల్లో వున్నప్పుడు నీ కూతుళ్ళొచ్చి చేశారా? గుర్తుతెచ్చుకో ఒకసారి'' చేతులు తిప్పుతూ కేకలేస్తోంది ప్రహరీగోడ అవతల్నుంచి పక్కింటి శమంత.

''ఇదుగో.. ఈ తిక్క వాగుడింకా పొడిగించావంటే వూరుకునేది లేదు. జాగ్రత్త! కాకిమీద పెట్టీ, గద్దమీద పెట్టీ తిడతావా నన్ను?'' వేలు ఎత్తి చూపుతూ బెదిరించింది సువర్ణమ్మ.

''అబ్బో నీ బెదిరింపులకి వణికిపోతున్నారిక్కడ! ఎల్లిమీద పెట్టీ పిల్లిమీద పెట్టీ నువు చేస్తున్నదేవిటో'' బారలు చాస్తూ అన్నది శమంత.

శ్రీధర్‌కి తెలిసీ తల్లి సువర్ణమ్మ, పక్కింటి ఆంటీ శమంతల మధ్య మంచి స్నేహం వుంది. తల్లిని ఆంటీ ఎంతో గౌరవంగా, ఆత్మీయంగా పలకరించటమూ, తల్లి శమంతను ఆప్యాయంగా, చనువుగా చూసుకోవటం అప్పుడప్పుడూ గమనించి వున్న శ్రీధర్, వాళ్ళిద్దరి మధ్యా చెలరేగిన వైరాన్ని నోరు తెరిచి చూస్తూ వుండిపోయాడు.

''పెద్దా చిన్నా లేకుండా నువ్వూ, నువ్వూ అంటూ నోరు పారేసుకుంటున్నావ్. ఏం చూసుకుని ఆ అదిరిపాటు నీకు? పెద్ద చదువుకున్నానని ఫోజులు కొడతావుగా. మేనర్స్ కూడా తెలీని మొద్దు మొహం నువ్వూనూ'' చీదరించుకుంటూ గొంతునరాలు వుబ్బిపోయేంత గట్టిగా అన్నది సువర్ణమ్మ.

''ఊహూ..మర్యాద అనేది ఒక పక్కనుంచే రాదు. రెండువేపులా వుండాలి. నువ్వు నన్ను పురుగును విదిలించినట్లు విదిలిస్తూంటే నేన్నీకు ఒంగి ఒంగి దణ్ణాలెట్టనా?'' దబాయించి అడిగింది శమంత.

''అబ్బో? ...'' చేతులు మరింత బారుగా చాచి అన్నది సువర్ణమ్మ- ''మర్యాద అనేది నువ్వు నాకు చెప్పొచ్చావా? అత్తగార్ని కనీసం వరసతోనైనా పలకరించలేని నువ్వు ఒక మనిషివేనా? ఆ పెద్దావిడకి పట్టెడు మెతుకులు పెట్టటానికి నీ చెయ్యెప్పుడైనా వచ్చిందా?'' చేతివేళ్ళు విరుచుకుంది.

''కోడలూ, కొడుకూ చనువుగా మాట్లాడుకుంటూంటేనే కళ్ళతో చూడలేని శూర్పణఖవి.. నువ్వంటూన్నావా నన్ను. మా అత్తకు నేను పెట్టకపోతే నువ్వొచ్చి రోజూ తినిపిస్తున్నావా?'' శమంత మాటలలో రోషం పొంగింది.

''సిగ్గులేదూ? నీ అత్తకు నేనొచ్చి తినిపించాలా?'' రివ్వున ప్రహరీగోడ దగ్గరకు వెళ్ళబోయిన తల్లిని చప్పున వచ్చి పొదివి పట్టుకుని వంటింట్లోకి లాక్కెళ్ళాడు శ్రీధర్.

శ్రీధర్ సువర్ణమ్మను లాక్కెళ్ళటం చూసి శమంత తనూ తగ్గి యింట్లోకెళ్ళిపోయింది.

★ ★ ★

ఆ మర్నాడు శ్రీకర్ యింటికి చేరేటప్పటికి- సువర్ణమ్మకూ, శమంతకూ మళ్ళీ తగాదా జరుగుతోంది. శ్రీకర్ సువర్ణమ్మగారి పెద్దకొడుకు.

''ఏదో మాటవరసకన్నా నీ అనసూయమ్మా, నువ్వూ ఎలా చస్తే నాకెందుకూ?''

''అలాంటి అప్రాచ్యపు వాగుళ్ళే వద్దన్నాను. నన్ను చావమంటావా? నీ నోట్లో మన్నింత పొయ్యా. ఏం పోయేకాలం వచ్చిందో నీకు''

''పోయేకాలం వచ్చింది కాబట్టే పిదప బుద్ధులు పుడుతున్నాయి. లేకపోతే నోరు లేని జీవి! దాని కాలిరగ్గొడతావా? ఎందుకూ? నీకు వచ్చింది వయసు అడవిలో మానుకీ వస్తుంది వయసు ఛీ! ఛీ!'' గొంతు చించుకుంది శమంత.

''నీకేం తక్కువుందా వయసు? బిడ్డా, పాపా లేక మోడుగా నిలబడి పదారేళ్ళ బాలాకుమారి ననుకుంటున్నావా? నీ బుద్ధుల్ని బట్టే రాత గూడాను. ఇంకా పైగా నోరెట్టుకు పడిపోతున్నావు'' పుల్లవిరిచినట్లు అన్నది సువర్ణమ్మ.

''అక్కడికి బిడ్డల్ని కని నువ్వేదో ఘనకార్యం వెలగబెట్టినట్లు! నీ మూలంగా ఒక్క బిడ్డైనా సుఖంగా బతగ్గలుగుతున్నారా? నీ కార్పణ్యంతో వాళ్ళ కాపరాలు తీశావు! నీ చరిత్రెవరికి తెలీదనీ?'' సాగదీసింది శమంత.

''తల్లికీ, బిడ్డకూ కాకుండా చేసి మొగుణ్ణి జేబులో వేసుకుని పుట్టినట్లు సాగిస్తున్నావు. నాకే వంక పెడుతున్నావా? గురివింద గింజ సామెతలా వుందిది'' సువర్ణమ్మ ముంచుకొస్తూన్న ఆయాసాన్ని బలవంతంగా అణచుకుని ఎత్తిపొడిచింది.

కాలేజ్ నుంచి వచ్చిన సువర్ణమ్మ ఆఖరి కొడుకు శ్రీధర్ ఆ తగాదాన్ని చోద్యంగా చూస్తున్న అన్నతో ''అమ్మను లోపలికి తీసుకొచ్చెయ్యన్నయ్యా'' అన్నాడు ఆందోళనగా.

''అసలు వీళ్ళిద్దరికీ తగాదా ఎందుకొచ్చిందీ?'' తాపీగా అడిగాడు శ్రీకర్.

''ఏమో నాకూ తెలీదు. నిన్న కూడా యిలాగే పోట్లాడుకున్నారు'' అన్నాడు తనే వెళ్ళి తల్లి భుజం గుచ్చి పట్టుకుని యివతలకు లాక్కొస్తూ.

గోడవతల శమంత భర్త ఆమెను పొదివి పట్టుకుని యింట్లోకి తీసుకెళ్ళి మందలించటంతో అప్పటికి తగాదా మాటు మణిగింది.

ఇటు సువర్ణమ్మ కొడుకులుగానీ, అటు శమంత భర్తగానీ వాళ్ళ తగాదా కారణాన్ని తెలుసుకోలేక విసిగి వూరుకున్నారు.

★ ★ ★

ఆ మర్నాడు మధ్యాహ్నం శమంత వాళ్ళ పెంపుడుకుక్క అలవాటు కొద్దీ సువర్ణమ్మగారి హాల్లోకి వచ్చింది.

ఎప్పుడూ దాన్ని ముద్దు చేసే సువర్ణమ్మ ''ఛీ!ఛీ! పో బైటకి, విశ్వాసం లేని పీనుగా?'' అంటూ చారు గరిట విసురుగా విసిరింది దాని మీదకి.

ఆ గరిట వెళ్ళి కుక్క వెనుక కాలికి బలంగా తగ



లటంతో అది కుయ్యో! అంటూ కాలు కుంటుకుంటూ వెళ్ళటంతో ఆ ముందు రోజు పిల్లి కాలి దెబ్బకే మండిపడిన శమంత కుక్క కాలు చూసి అగ్గిమీద గుగ్గిలమైపోయింది.

''ఎవరి కొచ్చిందీ మాయరోగం? నిన్న పిల్లిని చావగొట్టారు. ఇవాళ కుక్క ప్రాణాల్తీయటానికి సిద్ధపడ్డారు'' అంటూ ప్రహరీగోడ పక్కగా వచ్చి బిగ్గరగా అరిచింది.

చారుపోపు పెడ్తూన్న సువర్ణమ్మ చప్పున స్టౌ ఆర్పేసి పెరట్లోకి వచ్చింది.

''కుక్కల్ని యిళ్ళమీదికి వదిలి కరిపించి ప్రాణాల్తీయటానికి చూసేది నువ్వా? నేనా? ఒళ్ళు దగ్గరెట్టుకు మాట్లాడు'' సమయానికి చేతిలో వున్న పప్పు గుత్తి వూపుతూ అన్నది.

''నీ ప్రాణాల్తీయటానికే కుక్కను పెంచుతు న్నానుకున్నావా నేను? పప్పు గుత్తి పట్టుకుని కొట్టటానికొస్తున్నావ్? నీ జోరంతా నోరూ, వాయాలేని జీవాల మీద చూపిస్తున్నావ్? నువ్వ సలు మనిషి జన్మెత్తావా?'' శమంత అసహ్యంతో ఖాండ్రించి వుమ్మేసింది.

''నీకెంత పొగరు! నా మీద వుమ్మేస్తావా? నీకు దమ్ముంటే గోడ దాటిరా. నోట్లోకి మళ్ళీ ఉమ్మి రాకుండా నొక్కేస్తా'' రొప్పుతూ అంటూ చేతిలో పప్పు గుత్తి గోడమీంచి గిరాటెట్టబో యింది సువర్ణమ్మ. ఊపు చాలకపోవటంతో అది గోడకు తగిలి యివతలికే పడిపోయింది.

''హయ్యో! ఈ దరిద్రపుగొట్టుదాంతో యిన్ని మాటలు పడాల్సొచ్చిందే..నాకు..'' బి.పి. రైజ్ అవగా బావురుమంది సువర్ణమ్మ.

ఆరోజు ఆదివారమవటంతో యింట్లోనే వున్న సువర్ణమ్మ కొడుకులూ..శమంత భర్తా సువర్ణమ్మ ఏడుపు విని ప్రహరీగోడ దగ్గరకు పరుగెత్తుకొచ్చేశారు.

''చూశారా? ఆవిడ నన్ను పప్పుగుత్తితో కొట్టబోయింది. మన కుక్క కాలు విరగ్గొట్టి యింకా వేషాలేస్తోంది..'' ఉక్రోషంగా భర్తతో ఏదేదో చెప్పేస్తోన్న శమంతతో ''ఆవిడకు బి.పి. బాగా ఎక్కువై కొలాప్స్ అయినట్లుంది. ఇంట్లోకి మోసుకెళ్తున్నారు. ఇంట్లోకి తగలడు?'' అంటూ శమంతను చెంప మీద చాచి లెంపకాయ కొట్టాడు ఆమె భర్త శశికాంత్.

''మీరూ..మీరూ..నన్నే కొడుతున్నారా?'' భోరుమంది శమంత. బలవంతంగా ఆమెను నెట్టుకుంటూ లోపలికి తీసుకెళ్ళి కుర్చీలో కూలేశాడు శశికాంత్.

''అసలిదంతా ఎందుకొచ్చింది?'' గద్దించి అడిగాడు.

''నేనేదో చనువుగా అనసూయమ్మ గురించి అంటే..ఆవిడకి పొడుచుకొచ్చింది. మంచీ, చెడూ..ఆలోచన లేకుండా..భాగోతం మొదలెట్టేసింది..'' వెక్కిళ్ళ మధ్య చెప్పింది శమంత.

''ఇంతకీ అనసూయమ్మెవరు?''

సరిగ్గా అదే సమయంలో ఇదే ప్రశ్న కొడుకులిద్దరూ జమిలిగా అడిగారు తల్లి సువర్ణమ్మను.

''అనసూయమ్మ..హాస్పిటల్లో.. ఐ.సి.యూ. లో వుంది'' నాలుక కింద వుంచిన బి.పి. మాత్ర కరిగి మత్తు ఆవరిస్తూండగా నెమ్మదిగా అన్నది సువర్ణమ్మ.


పక్కింట్లో శమంత కళ్ళు తుడుచుకుని చిన్నగా దగ్గి ''ఆ..విసురంతా చూపించి అడుగులేస్తూంటే..మెట్లు మీంచి..జారి పడి..దెబ్బ తగిలించుకుని హాస్పిటల్ పాలయింది'' అని చెప్పింది భర్త శశికాంత్‌తో.

''ఆవిడ హాస్పిటల్లో వుంటే యిక్కడ మీరింత హంగామా చేయటం ఏమిటి?'' కుతూహలం ఆపుకోలేక అడిగాడు శ్రీకర్.

''అదీ..అదీ దొంగెత్తు.. అంటోందా.. శమం..'' మత్తు మరికాస్త ఆవరించగా గొణిగింది సువర్ణమ్మ.

''ఆ కోడలు..శశిరేఖే..కనపడకుండా..తోసేసిందని..మొండి వాదన మొదలెట్టిందావిడ, నాకు ఒళ్ళు..మండింది'' భర్త గుండెపై తల ఆన్చి వెక్కుతూనే చెప్పింది.

''ఆవిడంటే అంత అభిమానమున్న వాళ్ళు హాస్పిటల్‌కెళ్ళి చూసుకోవాలి గానీ ఈ కొట్టుకోవటం ఏమిటీ?'' శశికాంత్




విసుర్తుపోతూ అన్నాడు.

సువర్ణమ్మగారు పూర్తిగా మత్తులోకెళ్ళిపోవటంతో అనసూయమ్మ ఆరా సరిగ్గా తెలీని కొడుకులు అయోమయం అయిపోయి ఆమె మంచానికి అటుపక్కా, యిటుపక్కా వుసూరుమంటూ కుర్చీలలో కూలబడ్డారు.

''ఇంతకీ ఆ అనసూయమ్మగారిప్పుడెలా వుంది?'' కన్‌ఫ్యూజ్ అయిపోతూ అడిగాడు శశికాంత్.

''మంగళవారానిగ్గానీ తెలీదు'' చెప్పింది శమంత.

''అంత గడువు పెట్టారా డాక్టర్లు?'' షాక్ తిన్నట్లు అడిగాడు శశికాంత్.

''డాక్టర్లింకా ఏం చెప్పలేదు.''

''ఏమీ చెప్పకపోవడమేమిటి?''

''కడగండ్లకాలం సీరియల్ మళ్ళీ రావొద్దూ?''

కొన్ని క్షణాలు అవాక్కయి వుండిపోయాడు శశికాంత్!


తర్వాత తేరుకుని ''ఇదంతా సీరియల్ గురించా?'' అన్నాడు వస్తూన్న నవ్వుని ఆపుకుంటూ.

★ ★ ★

ఆ వారం సువర్ణమ్మతో పాటు ఆమె యిద్దరు కొడుకులూ, శమంతతో పాటు ఆమె భర్తా అనసూయమ్మకి ఏమైందోనన్న ఉత్కంఠతో వూపిరి బిగబట్టుకుని టి.వి. ముందు కూర్చున్నారు.

'కడగండ్లకాలం' సీరియల్ టైం సాయంత్రం ఏడు గంటలయింది. సరిగ్గా ఆ టైముకి టి.వి.స్క్రీన్ మీద ఒక ప్రకటన వచ్చింది.

''అనివార్య కారణాల వలన సీరియల్ 'కడగళ్ళకాలం' ప్రస్తుతానికి నిలిపివేస్తున్నాం. దాని స్థానే 'వడగళ్ళవాన' ప్రసారం చేస్తున్నాం'' అని.



## బిజీ అమీషా

'ఎలాన్' చిత్రం షూటింగ్‌తో అమీషాపటేల్ చాలా బిజీగా ఉంది. కుటుంబ వ్యవహారాల తలనొప్పితో బాధపడిన అమీషా ఇప్పుడు ఆ బాధలనించి విముక్తి కోసం ఈ సినిమా షూటింగ్‌లో క్షణం తీరికలేకుండా ఉంది. అలాగే షూటింగ్ లేని టైంలో ఆమె ఎప్పుడూ లైబ్రరీల చుట్టూ తిరుగుతోంది. ఈ వ్యాపకం ఆమెకి మనశ్శాంతిని బాగా ఇస్తున్నట్టుంది. పుస్తక పఠనం ఎవరికైనా మనశ్శాంతినిస్తుంది. అయినా ఇలాంటి తలనొప్పులు సినిమాలతో పాటూ నిత్యజీవితంలో కూడా ఎదురవ్వడం యాదృచ్ఛికమే.